TRUTH | PEOPLE | NATION

ప్రజల పక్షం.. ప్రజా స్వరం..

# రిపబ్లిక్ హిందుస్థాన్

REPUBLIC HINDUSTHAN TELUGU DAILY

NEWS VIEWS FOR A BETTER TOMORROW

సత్యం కోసం.. సమాజం కోసం.. భారతం కోసం..

సంపుటి: 2 సంచిక: 132 | బుధవారం 23 సెప్టెంబరు 2026 | ఆదిలాబాద్ | హైదరాబాద్ | ఎడిటర్ : రాథోడ్ రాజు | పేజీలు : 4 | వెల: రూ.2.00

## వందేమాతరం పాడకపోతే...'
## సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు

**వందేమాతరం పాడనంత మాత్రాన క్రిమినల్ చర్యలు కుదరవన్న సుప్రీం కోర్టు**

**మతపరమైన, మనస్సాక్షికి సంబంధించిన అభ్యంతరాలకు రక్షణ**

**జాతీయ గీతంగా వందేమాతరం హోదాను ప్రశ్నించలేమని స్పష్టీకరణ**

**గాయకుడు టీఎం కృష్ణ పిటిషన్పై విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు**



వందేమాతరం గీతాన్ని ఆలపించలేదన్న కారణంతో వ్యక్తులపై క్రిమినల్ చర్యలు తీసుకోవడానికి వీల్లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మతపరమైన విశ్వాసాలు లేదా మనస్సాక్షికి సంబంధించిన కారణాలతో ఎవరైనా



## జూరాల కోసం బెంగళూరుకు
# తెలంగాణ మంత్రులు

***జూరాల ప్రాజెక్టుకు నీటి విడుదలపై కర్ణాటకతో చర్చలు***

***నేడు బెంగళూరు వెళ్లనున్న తెలంగాణ మంత్రుల బృందం***

***కర్ణాటక సీఎం డీకే శివకుమార్ తో సమావేశం కానున్న మంత్రులు***

***ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి నీరు కోరనున్న తెలంగాణ***

***సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అనంతరం మంత్రుల పయనం***

మిగితా 2వపేజీలో...

## రిమ్స్‌లో చిన్నారుల మృతిపై సమగ్ర విచారణ చేయాలి

**ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్**

**రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి కి వినతి**

**జననినాదం,ఆదిలాబాద్ 22:** రిమ్స్ ఆసుపత్రిలో ముగ్గురు చిన్నారులు మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సోమవారం రాత్రి రిమ్స్ పీడియాట్రిక్ వార్డులో చోటుచేసుకున్న ఘటనలో ముగ్గురు చిన్నారులు మృతి చెందడం బాధాకరమన్నారు. ఘటనకు దారితీసిన పరిస్థితులపై



పూర్తిస్థాయిలో విచారణ జరిపి, నిర్లక్ష్యానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, మృతి చెందిన చిన్నారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.రిమ్స్‌లో వైద్యులు అందుబాటులో ఉండటం, రోగులకు అందుతున్న చికిత్స, వైద్య సేవల నాణ్యతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.

## 58గ్రామపంచాయతీలకు రూ.33.62 కోట్లు విడుదల
**: మంత్రి సీతక్క**



**హైదరాబాద్ 22:** తెలంగాణ కోర్టు కేసులు, ఇతర కారణాల వల్ల ఎన్నికలు జరగని 58 గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.33.62 కోట్లు విడుదల చేసిందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఎన్నికలు జరగలేదన్న కారణంతో కేంద్ర ఆర్థిక సంఘం నుండి నిధులు అందకపోయినా, గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా నిధులు సమకూర్చినట్లు విలేకరుల సమావేశంలో చెప్పారు. ప్రతి పంచాయతీని మాడల్ పంచాయతీగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

## జూరాలకు నీటి విడుదలపై
# సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం

**హైదరాబాద్ 22:** కర్ణాటక సీఎంతో నీటి సమస్యపై మాట్లాడడానికి మంగళవారం తెలంగాణ నుండి కర్ణాటక బయలుదేరిన మంత్రులు. ఉమ్మడి పాలమూరు జిల్లా రైతుల సాగునీటి అవసరాల దృష్టిలో ఉంచుకొని జూరాల ప్రాజెక్టు నుండి కాలువ ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి రాష్ట్ర మంత్రి పాలమూరు ఉమ్మడి జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి,గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ఇరిగేషన్ శాఖ మంత్రులు సచివాలయంలో కలిసి నీటి సమస్యను వివరించారు. మంత్రుల,ఎమ్మెల్యేల విజ్ఞప్తి పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. కర్ణాటక సీఎంతో



ఫోన్లో సంభాషించి సాగునీటి అవసరాల దృష్ట్యా ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాల నుండి నుంచి జూరాలకు నీటిని విడుదల చేయాలని కోరారు.

## ఆదిలాబాద్ రిమ్స్‌లో
# ఘోర విషాదం..
**అగ్నిప్రమాదంలో ఇద్దరు పసికందుల మృతి**



**,ఆదిలాబాద్ 22:** ఆదిలాబాద్ రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో సోమవారం అర్ధరాత్రి ఘోర విషాదం చోటుచేసుకుంది. ఆసుపత్రిలోని స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ)లో అగ్నిప్రమాదం జరగడంతో ఇద్దరు నవజాత శిశువులు మరణించారు. అప్రమత్తమైన సిబ్బంది వార్డులోని మరో 28 మంది చిన్నారులను సురక్షితంగా బయటకు తరలించడంతో పెను ప్రమాదం తప్పింది.సోమవారం రాత్రి సుమారు 11:50 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రాథమిక సమాచారం ప్రకారం ఎయిర్ కండిషనర్ (ఏసీ)లో ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు అధికారులు భావిస్తున్నారు. కొద్దిసేపట్లోనే వార్డు మొత్తం దట్టమైన పొగ, అగ్నికీలలతో నిండిపోయింది. అయితే, ప్రమాదానికి కచ్చితమైన కారణాలు

మిగితా 2వపేజీలో...

# కాంగ్రెస్ బిఆరెస్ కుమ్మక్కయ్యారు

**ప్రజలను డైవర్ట్ చేస్తున్నారు**

**మీ రాజకీయ డ్రామాలు ఆపండి ,, ఎంపి ఈటల**

**హైదరాబాద్ 22:** కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కుమ్మక్కయ్యారని ఎంపి ఈటల రాజేందర్ ఆరోపించారు. మిమ్మల్ని చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు. పంటలు ఎండడం చూస్తుంటే పల్లె పల్లెల పల్లేర్లు మొలిచాయి అనే పాట గుర్తుకు వస్తుంది. ఈ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుంది, పోయేకాలం వచ్చింది. గోదావరిలో నీళ్లు పారుతున్నప్పుడు ఎత్తి పోయకుండా కాంగ్రెస్ తెచ్చిన కరువు ఇదని అన్నారు.ఒకపక్క నీళ్లు లేక మరోపక్క కరెంటు కోతలతో పంటలు ఎండుతుంటే.. రోమ్ నగరం తగలబడుతుంటే పిడేలు వహించినట్లు ఉంది రేవంత్ రెడ్డి వ్యవహారం. జూరాల నీళ్లు ఇవ్వాలని వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు అరెస్ట్ ను తీవ్రంగా ఖండిస్తున్నాను. ప్రతిపక్ష నేతలను నిర్బంధించడం ఆపి రైతులకు నీళ్లు, కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా. బిఆర్ఎస్ వారి ఆస్తుల మీద విచారణకు మూడేళ్లుగా ఏం చేశారు. రేవంత్ నీకు నిజాయితీ లేదు. 23 లక్షల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని చెప్తున్న మీరు ఇన్నాళ్లు ఏం చేశారు ? ఫోన్ ట్యాపింగ్



## కవిత సమరశంఖం



**హైదరాబాద్, సెప్టెంబర్ 22,** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లో కవిత సమర శంఖం పూరించారు. ఆదివారం కొడంగల్ వేదికగా జరిగిన పాంచ జన్య సంకల్ప సభలో కవిత ఓపెన్ గా మాట్లాడారు. ఎటువంటి ఫిల్టర్లు లేకుండా తన అభిప్రాయాన్ని.. మొహమాటం లేకుండా చెప్పేశారు.నేను వాళ్ళు వదిలిన బాణం.. వీళ్ళు వదిన బాణం కాదు. అలాంటి తలకాయ లేని మాటలు మాట్లాడను. అలాంటి వారి కోసం నేను కొడంగల్ గడ్డమీద నుంచి చెబుతున్న. ఇప్పటికీ అధికారానికి.. విద్యకు దూరంగా ఉన్న మా బహుజనుల బాణాన్ని నేను. యువకుల యుద్ధ నినాదాన్ని నేను. వారికోసం మోడీతో కొట్లాడుతా. రేవంత్ రెడ్డితో కొట్లాడుతా. చివరికి కేసీఆర్ తో నైనా కొట్లాడుతా. తద్వారా తన మీద వస్తున్న విమర్శలకు ఈ స్థాయిలో కవిత సమాధానం చెప్పారు. అంతేకాదు తనమీద అవాకులు చవాకులు పేరుతున్న గులాబీ పార్టీ సోషల్ మీడియా.. ఆ పార్టీ అనుబంధ సోషల్ మీడియా గ్రూపులకు కవిత గట్టిగానే కౌంటంఇచ్చారు.వాస్తవానికి కవిత పాంచ జన్య సభలో గట్టిగా మాట్లాడారు. ఒక రకంగా దీనిని ఎన్నికల సభ లాగా ఆమె చాలెంజ్ గా తీసుకొని ప్రసంగించారు.. ప్రారంభం నుంచి చివరి దాకా బహుజనుల విషయాలను ప్రస్తావించారు.

మిగితా 2వపేజీలో...

## తెలంగాణకు భారీ నుంచి అతి భారీ వర్షసూచన.. పలు జిల్లాలకు
# ఆరెంజ్ హెచ్చరిక...

**బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం**

**తెలంగాణలో రెండ్రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు**

**ఎనిమిది జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ**

**తీవ్ర వాయుగుండంగా మారనున్నట్లు అంచనా**




బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది, మంగళ, బుధవారాల్లో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తాయని పేర్కొంది.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో అతి భారీ వర్షాలు, మరో 20 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు అధికారులు 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేశారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం రానున్న 12 గంటల్లో మరింత

## 60 గణేష్ మండపాల విఘ్నేశ్వరున్ని దర్శించు కున్న
# మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

**సిద్దిపేట 22:** ఏశుభకార్యం ప్రారంభించినా ముందుగా విఘ్నేశ్వరుడిని పూజించడం మన సంస్కృతి, సంప్రదాయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. విఘ్నాలను తొలగించి కార్యసిద్ధిని ప్రసాదించే వినాయకుడి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు.వినాయక నవరాత్రుల సందర్భంగా సిద్దిపేట పట్టణం లో 60 గణేష్ మండపాల లో కొలువైన విఘ్నేశ్వరున్ని దర్శించుకున్నారు కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడుతూ. యజ్ఞం, హోమం, వ్రతం, పూజతో పాటు ఏ శుభకార్యమైనా వినాయకుడిని పూజిస్తామన్నారు. దేవుడిని ఎంత ఆడంబరంగా పూజించామన్నది ముఖ్యం కాదు..ఎంత భక్తి, శ్రద్ధతో పూజించామన్నదే ముఖ్యమని. బంగారంతో పూజ చేసినా భక్తి లేకపోతే ప్రయోజనం లేదన్నారు. మట్టితో చేసిన వినాయకుడినైన మనస్ఫూర్తిగా పూజిస్తే



భగవంతుడి ఆశీస్సులు లభిస్తాయి అని పేర్కొన్నారు. వినాయక ఉత్సవాల్లో మట్టి విగ్రహాలు, సహజ రంగుల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్, రసాయనాలు, హానికరమైన రంగుల వినియోగం వల్ల చెరువులు, నీటి వనరులు, భూగర్భ జలాలు కలుషితమై చివరకు ప్రజల ఆరోగ్యంపైనే ప్రభావం చూపుతాయని తెలిపారు.

ప్రజల పక్షం.. ప్రజా స్వరం..

# రిపబ్లిక్ హిందుస్థాన్

REPUBLIC HINDUSTHAN TELUGU DAILY

సత్యం కోసం.. సమాజం కోసం.. భారతం కోసం..

బుధవారం 23 సెప్టెంబరు 2026



## భారీ పెట్టుబడి మోసం కేసును ఛేదించిన కరీంనగర్ పోలీసులు




**కరీంనగర్ 22:** కరీంనగర్‌లో భారీ స్థాయిలో జరిగిన పెట్టుబడి మోసం కేసును కరీంనగర్ పోలీసులు ఛేదించారు. పెట్టుబడి పథకాల ద్వారా ప్రజలను ఆకర్షించి కోట్లాది రూపాయలు సేకరించి మోసం చేసిన కేసులో ప్రధాన నిందితుడు హేమంత్ కుమార్ రాయ్తో పాటు రాజేష్ కుమార్, బ్రిజేష్ కుమార్ మిశ్రాలను పోలీసులు అరెస్ట్ చేశారు. 2020లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో స్థాపించిన ఈ సంస్థ ద్వారా వివిధ పెట్టుబడి పథకాలను ప్రవేశపెట్టి తక్కువ కాలంలో పెట్టుబడులకు రెండింతలు, మూడింతలు లాభాలు వస్తాయని నమ్మబలికినట్లు విచారణలో వెల్లడైంది. నెట్‌వర్క్ చైన్ విధానంలో కొత్త పెట్టుబడిదారుల నుంచి సేకరించిన మొత్తాలతో పాత పెట్టుబడిదారులకు చెల్లింపులు చేస్తూ మరింత మందిని పెట్టుబడులకు ఆకర్షించినట్లు పోలీసులు తెలిపారు. కరీంనగర్ జిల్లా సహా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల్లో ఏజెంట్లను నియమించి పెద్ద మొత్తంలో పెట్టుబడులు సేకరించారు. కొంతకాలం చెల్లింపులు చేసిన అనంతరం మే 2024 నుంచి చెల్లింపులు నిలిపివేసి పెట్టుబడిదారులను మోసం చేసినట్లు విచారణలో తేలింది. ఈ వ్యవహారంపై బాధితుడు గుగులోత్ శివరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, సీపీ ఆదేశాల మేరకు కేసును సిసి పిఎస్ కరీంనగర్‌కు బదిలీ చేశారు. రీంనగర్ ఇన్‌స్పెక్టర్ ఆర్. ప్రకాశ్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి, 18-09-2026 రాత్రి లక్నోలోని నిందితుల నివాసంలో హేమంత్ కుమార్ రాయ్, రాజేష్ కుమార్, బ్రిజేష్ కుమార్ మిశ్రాలను అదుపులోకి తీసుకుంది. నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను లక్నోలోని గౌరవనీయ చీఫ్ జుడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి, ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలించారు. కేసును ఛేదించడంలో కీలకంగా పనిచేసిన సిసి ఎస్ ఇన్‌స్పెక్టర్ ఆర్. ప్రకాశ్ గౌడ్, ఎస్సై డి. మహిపాల్ రెడ్డి మరియు సిబ్బందిని పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం అభినందించారు.

## ఆదిలాబాద్ రిమ్స్‌లో ఘోర విషాదం..

మొదటిపేజీ తరువాయి...

ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు తర్వాతే స్పష్టత వస్తుందని అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ దురదృష్టకర ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై లోతుగా విచారణ జరుపుతున్నారు. ముఖ్యంగా ఎస్ఎన్‌సీయూలోని ఎలక్ట్రికల్ వ్యవస్థ, ఏసీ పరికరాలు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా? లేదా? అనే కోణంలో దర్యాప్తు సాగనుంది. ఈ మరణాలకు సిబ్బంది నిర్లక్ష్యం ఏమైనా కారణమా? అనే అంశాన్ని కూడా తేల్చనున్నారు.

సీఎం రేవంత్ రెడ్డిగ్ర్భ్రాంతి..

విచారణకు ఆదేశంరిమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఇద్దరు శిశువులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రగ్ర్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనలో ప్రభావితమైన మిగతా చిన్నారులందరికీ అత్యుత్తమ వైద్యం అందించాలని, వారి ఆరోగ్య



పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి, సమగ్ర నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో ఫైర్, ఎలక్ట్రికల్ భద్రతా చర్యలను పటిష్ఠం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న ప్రమాదం జరిగిన రిమ్స్‌ను సందర్శించి విచారం వ్యక్తం చేశారు.

## హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు నిమజ్జన పాయింట్‌ను పరిశీలించిన సిద్దిపేట సీపీ రష్మి పెరుమాళ్

**సిద్దిపేట 22:** సిద్దిపేట జిల్లావ్యాప్తంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో, అధికారులు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఆదేశించారు. జిల్లాలో మొత్తం ముడువేయిలకు పైగా వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించగా, నిమజ్జన బందోబస్తు పరిశీలనలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన పాయింట్‌ను సీపీ మంగళవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ. నిమజ్జనానికి సంబంధించి అవసరమైన అన్ని మౌలిక వసతులు, ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను సూచించారు. శోభాయాత్ర సమయంలో పట్టణంలో రద్దీ ఏర్పడకుండా, వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందంను ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు వాలంటీర్లు పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని, ఎలాంటి డీజే శబ్దాలు లేకుండా, భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలందరూ పరస్పరం సహకరించుకుంటూ మతసామరస్యాన్ని కాపాడాలని, గణేష్ ఉ



త్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో ఎలాంటి వదంతులు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అనుచిత పోస్టులను ప్రచారం చేయవద్దని, ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించవద్దని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎసిపి సదానందం, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, హుస్నాబాద్ సీఐ శ్రీధర్, హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## కవిత సమరశంఖం

మొదటిపేజీ తరువాయి...

తన తండ్రి పరిపాలన కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో మార్పు రాలేదని. ముఖ్యంగా విద్య.. వైద్యం.. ఇతర వాటిల్లో వృద్ధి కనిపించలేదని కవిత క్లారిటీ ఇచ్చారు. విద్య.. వైద్యం వంటివి తమ ప్రథమ ప్రాధాన్యాలు అని కవిత క్లారిటీ ఇచ్చారు. అక్కడితోనే ఆగిపోలేదు.. ఇంకా చాలా విషయాలను కవిత ఈ సభలో చెప్పారు. తన తండ్రి పరిపాలన కాలంలో జరిగిన అవినీతిని.. అక్రమాలను.. తనను బయటికి పంపించిన విధానాన్ని ఆమె వివరించారు. ఇటీవల తన అత్తగారిల్లు అయిన నిజామాబాదులో పాంచ జన్య సభను నిర్వహించిన కవిత.. అక్కడ కన్నీళ్లు పెట్టుకున్నారు. సభలో మాట్లాడుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. కొడంగల్ లో మాత్రం ధైర్యంగా మాట్లాడారు. ప్రభుత్వం మీద ఆరోపణలు చేసిన ఆమె.. చివరికి తన తండ్రిని కూడా వదిలిపెట్టలేదు. అన్నిటికంటే ముఖ్యంగా గులాబీ పార్టీ సోషల్ మీడియాకు దిమ్మతిరిగిపోయేలాగా కవిత రిప్లై ఇచ్చింది. ఒక రకంగా దానిని స్లిప్పర్ షాట్ అని చెప్పవచ్చు. కొద్దిరోజులుగా గులాబీ పార్టీ సోషల్ మీడియా కవిత మీద వ్యక్తిగతంగా దాడి చేసే స్థాయిలో విమర్శలు చేస్తోంది. ఆ విమర్శలకు కవిత ఏర్పాటుచేసిన సోషల్ మీడియా గ్రూపులలో కౌంటర్ ఇస్తున్నప్పటికీ.. గులాబీ పార్టీ సోషల్ మీడియా ఆగడం లేదు. అందువల్లే కొడంగల్ సభ నుంచి కవిత గట్టిగా రిప్లై ఇచ్చారు. మరి దీనికి గులాబీ పార్టీ సోషల్ మీడియా ఎలాంటి కౌంటర్ ఇస్తుందో చూడాలి.

## దళిత, ఆదివాసీ ఆత్మగౌరవం కోసం మరో కీలక అడుగు.

**నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి.**

**వనపర్తి22:** తెలంగాణ రాష్ట్ర ఎంపీల కోసం రాష్ట్ర కన్వీనర్ నాగర్ కర్నూల్ సభ్యులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి దళితులు, ఆదివాసీల ఆత్మగౌరవం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించనున్న దళిత?ఆదివాసీ ఆత్మగౌరవ సభ”××కు హాజరు కావాల్సిందిగా ంఎఅఅ ఆదివాసీ కాంగ్రెస్ ూ విభాగం చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ విక్రాంత్ భూరియా ని డాక్టర్ మల్లు రవి స్వయంగా కలిసి ఆహ్వానించారు. సెప్టెంబర్ 29, 2026 మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల వరకుకాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా మావళంకర్ హాల్, న్యూఢిల్లీకాంగ్రెస్ ఎంపీల ఫోరమ్ మరియు విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ సభలో దళితులు, ఆదివాసీల గౌరవం, ఆత్మగౌరవం, సమానత్వం



మరియు రాజ్యాంగపరమైన హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలపై నాయకులు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా తమ స్వరాన్ని వినిపించనున్నారు.

## ధర్మపురి, రాయపట్నం గోదావరి నది తీరం వద్ద, రాయికల్ గణేశ్ నిమజ్జన ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

**జగిత్యాల22:** గణేశ్ నిమజ్జననీ శాంతియుతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సజావుగా జరిగేలా అన్ని విభాగాలు సమన్వయంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. ఈ రోజు జిల్లా ఎస్పి అశోక్ కుమార్ తో కలిసి గణేష్ నిమజ్జన ప్రాంతాలైన ధర్మపురి, రాయపట్నం గోదావరి నది తీరం, రాయికల్ వద్ద ఏర్పాట్ల పరిశీలన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్క నిర్వాహకులు అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎటువంటి సంఘటనలు జరగకుండా శోభయాత్ర, నిమజ్జనం వేడుకలు చేసుకోవాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళికతో వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి కావలసిన, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వైద్య సేవలు, అగ్నిమాపక శాఖ, మత్స్యశాఖ, అధికారులు సేవలు అందించాలని, నిమజ్జన ప్రదేశాల్లో పారిశుధ్య పనులు చేయించాలని, భారీ క్రేన్లు, చిన్న క్రెన్ లు, గజ ఈతగాళ్ళు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణ వాసులతో పాటు భక్తులు, పిల్లలు తరలివచ్చే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జనం వేడుకలు భక్తులందరూ భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ.... వినాయక నిమజ్జన కార్యక్రమాలు



శాంతియుతంగా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా పూర్తి కావడానికి పోలీస్ శాఖ తరపున అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. నిమర్జనం అంతయు ప్రశాంత వాతావరణం లో పూర్తి అయ్యేలా అవసరమైన ప్రాంతాలలో సిసి కెమెరాలను, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామని, స్థానిక గజ ఈతగాళ్లు ను నిమర్జన ప్రాంతములో అందుబాటులో ఉంచమని, శోభాయాత్ర వెళ్ళేమార్గం లో ఇతర శాఖ ల యొక్క సమన్వయము తో ఎటువంటి అవాంతరములు తలెత్తకుండా పటిష్టమైన చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా డీజే లు, సౌండ్ సిస్టంలు,బాణాసంచా కాల్చడం వంటివి చేయరాదని తెలిపారు. చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, చట్టానికి లోబడి నడుచుకోవాలని తెలిపారు. చట్టానికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక నిమజ్జనంను శాంతియుతంగా, సామరస్యంగా జరుపుకోవాలని అందుకు ప్రజలు పూర్తిగా పోలీసు వారికి సహకారం అందించాలని కోరారు.

## ఏసీబీ వలలో అసెస్ మెంట్ అధికారి

**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 22:** భీమిని మండలం, పెద్దాపేట గ్రామ పరిపాలన అధికారి (జి.పి.ఓ.) దుర్గా ప్రసాద్, ఫిర్యాదిదారుడి నుండి డిమాండ్ చేసిన రూ. 1,30,000/- లంచంలో మొదటి విడత అయిన రూ. 80,000/-ను తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. పెద్దాపేట శివార్లలోని వ్యవసాయ క్షేత్రాల సమీపంలో ఏసీబీ ఆదిలాబాద్ రేంజ్ యూనిట్కు రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డాడు. ఫిర్యాదిదారుని పేరు మీద భూమి బదిలీ, పట్టా పాస్బుక్లను జారీ చేయడం రూ. 1,30,000/-లంచం డిమాండ్ చేశాడుజ. అందులో భాగంగా, మొదటి విడతగా రూ. 80,000/- మరియు పని పూర్తయిన తర్వాత మిగిలిన రూ. 50,000/- చెల్లించాలని ఆదేశించాడు. బాధితులు లంచం నగదు ఇవ్వడానికి వచ్చినప్పుడు మరో వ్యక్తి పోతు రాజేందర్తో కలిసి మోటార్సైకిల్పై పెద్దాపేట చేరుకుని, ఫిర్యాదిదారుడిని రూ. 80,000/- తీసుకున్నాడు. అక్కడే మాటు



వేసిన ఏసీబీ బృందం దుర్గాప్రసాద్ ను పట్టుకుంది. ఇద్దరిని అరెస్టు చేసి ఏసీబీ కోర్టుకు తరలించారు.

## వందేమాతరం పాడకపోతే...' సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి...

ఈ గీతాన్ని పాడటానికి నిరాకరిస్తే, వారిపై ఎటువంటి శిక్షార్హమైన చర్యలు ఉండబోవని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. అదే సమయంలో, జాతీయ గీతంగా వందేమాతరం హోదాను న్యాయస్థానాలు సమీక్షించలేవని కూడా స్పష్టం చేసింది. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణ దాఖలు చేసిన పిటిషన్పై మంగళవారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జాయ్మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఈ సందర్భంగా పలు కీలక వ్యాఖ్యలు చేసింది. వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలన్న కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్ను, అలాగే జాతీయ చిహ్నాలను అవమానించకుండా నిరోధించే చట్టం-2026 సవరణను టీఎం కృష్ణ సవాల్ చేశారు. గీతంలోని చివరి నాలుగు చరణాలలో హిందూ దేవతల ప్రస్తావన ఉండటం రాజ్యాంగబద్ధమైన లౌకిక స్ఫూర్తికి, మత స్వేచ్ఛకు విరుద్ధమని ఆయన తన పిటిషన్ లో పేర్కొన్నారు. విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ, “వందేమాతరం సుదీర్ఘ కాలంగా జాతీయ గీతంగా కొనసాగుతోంది, దాని హోదాను మేము ప్రశ్నించలేము” అని వ్యాఖ్యానించింది. అయితే, ఆర్టికల్స్ 25, 26 ప్రకారం మత విశ్వాసాలు లేదా వ్యక్తిగత విచక్షణ కారణంగా ఎవరైనా ఈ గీతాన్ని పాడటానికి అభ్యంతరం వ్యక్తం చేస్తే, వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. వ్యక్తులు తమ ఇష్టానుసారం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ చరణాలను పాడవచ్చని లేదా అస్సలు పాడకుండా ఉండవచ్చని కోర్టు అభిప్రాయపడింది. 1986 నాటి చరిత్రాత్మక బిజో ఇమ్మాన్యుయేల్ కేసులో, మత విశ్వాసాల కారణంగా జాతీయ గీతాన్ని పాడలేమని కోరిన జెహోవా సాక్షుల విభాగానికి చెందిన విద్యార్థులకు సుప్రీంకోర్టు రక్షణ కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం గుర్తు చేసింది. ప్రాథమిక హక్కులను ప్రాథమిక విధులు అధిగమించలేవని ఆ తీర్పు స్పష్టం చేసిందని పేర్కొంది. ప్రస్తుత పిటిషన్లో కేవలం క్రిమినల్ చర్యలకు సంబంధించిన అంశాన్ని మాత్రమే పరిశీలిస్తామని, గీతంలోని సాహిత్యంపై లేదా దాని అధికారిక హోదాపై ఎటువంటి తీర్పు ఇవ్వబోమని న్యాయస్థానం వెల్లడించింది.

## జూరాల కోసం బెంగళూరుకు తెలంగాణ మంత్రులు

జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయాలని కోరేందుకు తెలంగాణ మంత్రుల బృందం మంగళవారం బెంగళూరుకు బయలు దేరనుంది. కృష్ణా బేసిన్లో నెలకొన్న నీటి కొరత నేపథ్యంలో, పొరుగు రాష్ట్రమైన కర్ణాటకతో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ పర్యటనలో భాగంగా మంత్రులు, ఎమ్మెల్యేల బృందం కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమావేశం కానుంది. ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్ల నుంచి జూరాల ప్రాజెక్టుకు సాగునీటిని విడుదల చేయాలని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేయనున్నారు. అంతకుముందు, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు చెందిన

మొదటిపేజీ తరువాయి...

మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. జూరాల ప్రాజెక్టు నీటి అవసరాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చల అనంతరం, కర్ణాటక ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం మేరకు మంత్రుల బృందం నేడు సాయంత్రం బెంగళూరుకు పయనం కానుంది. ఇరు రాష్ట్రాల మధ్య జరిగే ఈ ద్వైపాక్షిక చర్చల ద్వారా జూరాల ఆయకట్టు రైతులకు తగిన ఊరట లభిస్తుందని తెలంగాణ ప్రభుత్వం ఆశిస్తోంది.

## కాంగ్రెస్ బిఆరెస్ కుమ్మక్కయ్యారు

మొదటిపేజీ తరువాయి...

కేసు, ఫార్ములా వన్ కేసులు ఏమయ్యాయి. ఫాం హౌస్ ల డ్రామాలు పక్కన పెట్టి ప్రజలకు నీళ్ల కరెంటు ఇవ్వాలి. బీజేపీ మాత్రమే ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంది. కాంగ్రెస్ కి వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది బీజేపీనే. మూసీ, 22 ఏ మీద పోరాటం చేయడానికి ఎతీబ కి ముఖం లేదు. హైడ్రా, మూసీ, 22 ఏ, ఫీజు రీఎంబర్స్మెంట్, ఉద్యోగాలు, పంటలకు నీళ్ల కోసం పోరాటం చేస్తున్న పార్టీ బీజేపీ. ఇకనైనా రెండు పార్టీల డ్రామాలు పక్కన పెట్టి రైతులను ఆదుకోవాలని అన్నారు.

## తెలంగాణకు భారీ నుంచి అతి భారీ వర్ష సూచన.. పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక...

మొదటిపేజీ తరువాయి...

బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో బుధ, గురువారాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.

TRUTH | PEOPLE | NATION
రిపబ్లిక్ హిందుస్తాన్
REPUBLIC HINDUSTHAN TELUGU DAILY
ప్రజల పక్షం.. ప్రజా స్వరం..

# పఠనంతో జ్ఞానం.. సృజనాత్మకత

## విద్యార్థుల్లో పఠనాసక్తి, భాషా నైపుణ్యాల పెంపునకు రీడతాన్ దోహదం

**కలెక్టర్ కె. హరిత**




**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 22:** చిన్ననాటి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవడం ద్వారా విద్యార్థుల్లో జ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత, వ్యక్తీకరణ సామర్థ్యాలు పెంపొందుతాయని కలెక్టర్ కె.హరిత అన్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచడంతో పాటు చదవడం ద్వారా అవగాహన, భాషా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు కేబీ రీడతాన్ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 45 స్కూల్ కాంప్లెక్స్‌లలో విజేతలుగా నిలిచిన ప్రాథమిక స్థాయి విద్యార్థులకు జిల్లా స్థాయి పఠన పోటీలను మంగళవారం తెలంగాణ మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పఠనాన్ని విద్యార్థుల దైనందిన జీవితంలో భాగంగా చేయాలని సూచించారు. విద్యార్థులు ఆనందంగా చదివి, అర్థం చేసుకుని తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తీకరించేలా పాఠశాలల్లో పఠన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు.

నాలుగేళ్లుగా కేబీ రీడతాన్‌ఎఫ్‌ఎల్‌ఎన్ లక్ష్యాల సాధనలో భాగంగా ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో గత నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న కేబీ రీడతాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ అభినందించారు. ప్రాథమిక విద్యా పునాదులను బలోపేతం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమన్నారు.

**విజేతలు వీరే..**

జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి దహెగాం మండలం దహెగాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థి తుమ్మిడి వశిష్ట సాధించారు. ద్వితీయ బహుమతి రెబ్బెన మండలం గొల్లగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని యు. ఐశ్వర్యకు, తృతీయ బహుమతి దహెగాం మండలం చిన్నరాస్పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 5వ తరగతి విద్యార్థిని రౌతు సాన్వికి దక్కాయి.విజేతలకు కలెక్టర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరినీ అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పఠన కార్యకలాపాల్లో పాల్గొనాలని సూచించారు. పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజు మర్మట్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్టే అనిల్‌కుమార్, రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ రాష్ట్ర మేనేజర్ చారి, జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, రూమ్ టు రీడ్ జిల్లా ప్రతినిధి మధు, స్థానిక పాఠశాల ప్రిన్సిపల్ మహేశ్వర్, న్యాయ నిర్ణేతలు శ్రీనివాస్, నాగేందర్, రేవతి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 22:** జిల్లాలో చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూర్ లో గల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో మండల తహసిల్దార్, మున్సిపల్ కమిషనర్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్, సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులతో ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఇప్పటి వరకు జరిగిన పురోగతిని సమీక్షించి, ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందించిన ఓటర్లకు హియరింగ్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని, ఈ క్రమంలో సంబంధిత ఓటర్ల క్లెయిమ్స్, అభ్యంతరాలు త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా అన్ని ప్రక్రియలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, క్షేత్రస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవాలని సూపర్‌వైజర్లు, బూత్ స్థాయి అధికారులకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 22:** ప్రభుత్వ పాఠశాలలలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని తాండూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సకల సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను మండల తహసిల్దార్ జ్యోత్స్న తో కలిసి పరిశీలించారు. భూ సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామ నక్షాలు, రైతుల సంబంధిత భూముల నిర్ధారణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి, ఆసరా పింఛన్ల దరఖాస్తుల పరిశీలన వివరాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించి ఆరోగ్య కేంద్రం పరిధిలో గల గర్భిణుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవ అందించాలని, గర్భిణులు సమయానుసారంగా అవసరమైన పరీక్షలు చేసుకొని, పౌష్టిక ఆహారం తీసుకోవాలని, తప్పనిసరిగా ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తో కలిసి సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన వేగవంతం చేయాలని, అర్హత గల ప్రతి ఓటరు వివరాలు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ దృవపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలో భారత జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన గోశాల కొరకు డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జాతీయ రహదారుల సంస్థ పి.డి. అజయ్ మణికుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, తహసిల్దార్ కృష్ణ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గోశాల కొరకు జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో 1 ఎకరం 15 గుంటల విస్తీర్ణంలో గోశాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.అంతకుముందు మంచిర్యాల పట్టణంలో అంజనీపుత్ర ఎస్టేట్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక మండలిని సందర్శించి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని కుల, మతాలకు అతీతంగా సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా అందరూ కలిసి జరుపుకోవాలని, నిమజ్జన ప్రాంతాలలో జాగ్రత్తలు వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పరిశుభ్రతకు ప్రాధాన్యం

**సర్పంచ్ ఆత్రం శేషునారాయణ**



**లింగాపూర్ 22:** గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని గుమ్మనూరు గ్రామపంచాయతీ సర్పంచ్ ఆత్రం శేషునారాయణ అన్నారు. మంగళవారం గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన పెంటకుప్పలను సిబ్బందితో కలిసి తొలగించారు. రోడ్డు వెంట చెత్త, వ్యర్థాలు పేరుకుపోవడంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని, గ్రామంలో ఎక్కడైనా ప్రత్యేక పరిస్థితులు ఏర్పడితే వాటిని గుర్తించి తక్షణమే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నామని, రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేయకుండా గ్రామస్థులు సహకరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

# ధాన్యం నిల్వకు అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి యాప్‌లో నమోదు చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 22:** జిల్లాలో ధాన్యం నిల్వకు అందుబాటులో ఉన్న గోదాములు, ఇతర నిల్వ సామర్థ్యాన్ని గుర్తించి సంబంధిత యాప్‌లో వివరాలు నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, మేనేజర్ శ్రీకళలతో కలిసి ఎస్‌డబ్ల్యుసి గోదాముల మేనేజర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అందుబాటులో ఉన్న గోదాముల నిల్వ సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో గుర్తించి, వివరాలను యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ధాన్యం సేకరణకు ముందస్తు ఏర్పాట్లలో భాగంగా అవసరమైన నిల్వ స్థలాలను గుర్తించి అందుబాటులో ఉంచాలని తెలిపారు.అనంతరం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సామర్థ్యానికి అనుగుణంగా రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యం సిఎంఆర్ డెలివరీలను వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సిఎంఆర్ డెలివరీలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.వానాకాలం 2026-27 సీజన్‌కు సంబంధించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులు, మెప్మా, డి.సి.ఎం.ఎస్. ప్రతినిధులతో ధాన్యం సేకరణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ, అవసరమైన అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి తీసుకోవలసిన చర్యలు, పాటించవలసిన నిబంధనలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన పరికరాలు, మౌలిక సదుపాయాలను నెలాఖరులోగా సిద్ధం చేసుకోవాలని సూచించారు. సేకరణ కేంద్రాల ఏర్పాటుకు తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలను (లో-లైయింగ్ ఏరియాలు) ఎంపిక చేయరాదని, సేకరణ కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో సివిల్‌సప్లై అధికారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సౌకర్యాల్లో నిర్లక్ష్యం వద్దు

**ఆరోగ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి**
**విద్యార్థుల హాజరు శాతం పెంచాలి**
**ఉపాధ్యాయులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దు**
**డీడీ జాదవ్ అంబాజీ**
**ఆశ్రమ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు**



**,లింగాపూర్/సిర్పూర్(యు) 22:** గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండొద్దని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాదవ్ అంబాజీ అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, వసతి, భోజనం, విద్య, పరిశుభ్రతపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. మంగళవారం సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లోని పలు పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంచన్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనం, వసతి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి, పాఠశాల పరిసరాల పరిశుభ్రతను తనిఖీ చేశారు. అక్కడే విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయొద్దని, నాలుగో తరగతి ఉద్యోగులు సైతం తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. కంచన్‌పల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ముల్లగూడ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులు, గ్రామస్థులతో ఉపాధ్యాయులు సమన్వయం చేసుకోవాలన్నారు. మహాగావ్ స్కూల్ కాంప్లెక్స్‌లో జైనూర్, మహాగావ్, కంచన్‌పల్లి కాంప్లెక్స్‌ల పరిధిలోని ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, విద్యా ప్రమాణాలపై సమీక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న స్కూల్ బ్యాగులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్‌లు ప్రతి విద్యార్థికి సక్రమంగా అందేలా చూడాలన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని పాఠశాలలను తరచూ సందర్శిస్తామని డీడీ జాదవ్ అంబాజీ తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్య, ఆరోగ్యం, వసతి, ఇతర మౌలిక సదుపాయాలు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు. మహాగావ్ ఆశ్రమ పాఠశాలను తొలిసారి సందర్శించిన డీడీ జాదవ్ అంబాజీని ఏటీడీవో శ్రీనివాస్, పీఎంఆర్‌సీ ఏసీఎంవో పూర్కా ఉద్ధవ్, ప్రధానోపాధ్యాయులు ఆత్రం పార్వతి, ఆత్రం రమాబాయి, శంకర్‌రావు, ఎస్‌సీఆర్‌పీలు చౌహాన్ రవీందర్, సీతారాం, జాదవ్ ప్రఫుల్‌కుమార్, ఉపాధ్యాయులు శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు.

# వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుపుకోవాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబరు 22:** వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రజలందరూ మతసామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని గూడెం, ఇతర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రదేశాలను మండల తహసిల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, ఎస్.ఐ., మండల పంచాయతీ అధికారులతో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిమజ్జన ప్రాంతాలలో భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని, విద్యుత్ దీపాలు, నిమజ్జనానికి అవసరమైన క్రేన్లు, పారిశుధ్య నిర్వహణ, బారికేడింగ్, రహదారుల శుభ్రత, త్రాగునీటి సౌకర్యం, వాహనాల రాకపోకల నిర్వహణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. నిమజ్జన సమయంలో విగ్రహాలను సురక్షితంగా నీటిలోకి తరలించేందుకు ఏర్పాటు చేసిన గజ ఈతగాళ్ల బృందాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితులలో తక్షణమే స్పందించేలా అవసరమైన సిబ్బంది, రక్షణ పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. రాత్రివేళలలో తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాట్లను పూర్తి చేయాలని, క్రేన్లు పనిచేసే స్థితిలో ఉండేలా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని, ప్రజలు, భక్తులు నీటిలోకి వెళ్లకుండా అవసరమైన బారికేడ్లు, భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ అనంతరం వ్యర్థాలు, పూజా సామగ్రి తదితరాలను వెంటనే తొలగించేలా పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, నిమజ్జన పాయింట్ల వద్ద పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, వాహనాల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, రాకపోకల నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వినాయక నిమజ్జన కార్యక్రమం శాంతియుతంగా, సురక్షితంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వైద్య విధానానికి నాంది మన ఆయుర్వేదం



**ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 22:** ప్రపంచ వైద్య విధానానికి నాంది మన ఆయుర్వేదమేనని ప్రభుత్వం ఆయుర్వేద వైద్యులు డా. యు.వెంకటేష్ అన్నారు. 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయుర్వేదమే సంపూర్ణ ఆరోగ్యం అనే నినాదంతో జిల్లాలోని అడ లోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి ఆధ్వర్యంలో 3 రోజుల ఉచిత వైద్య శిబిరాలలో 2వ రోజు డా. శిల్పా మోహన్ తో కలిసి హాజరై వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఈ నెల 21, 22, 23 తేదీలలో ప్రజలకు వివిధ ఆయుష్ వైద్య సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందని తెలిపారు. శిబిరంలో భాగంగా 2వ రోజు అడ లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యోగాసనాలు, ధ్యానం తదితర కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఆయుష్ వైద్య విధానాలు, యోగా, ధ్యానం, ఆయుష్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాదవ్ అరవింద్ నాయక్, పాఠశాల సిబ్బంది, ఆయుష్ ఇన్‌స్పెక్టర్లు, ఆయుష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

**మండల విద్యాశాఖ అధికారి కుడ్మెత సుధాకర్**



**సిర్పూర్(యు) 22:** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని మండల విద్యాశాఖ అధికారి కుడ్మెత సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయులకు మండలస్థాయి అవార్డులు, ప్రశంసాపత్రాల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించడంతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని అలవర్చాలన్నారు. ఉపాధ్యాయుల బోధన, మార్గదర్శనం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రతి విద్యార్థిలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తూ ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి అవార్డులతో సత్కరించడం ద్వారా మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం నిర్వహించాలి

**పోలీసులకు సహకరించాలి**

**జైనూర్ సీఐ రమేష్**

**జైనూర్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్**



**జైనూర్ 22:** గణేశ్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని జైనూర్ సీఐ రమేష్ అన్నారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు, ఆసిఫాబాద్ డీఎస్పీ సూచనలతో మంగళవారం జైనూర్ మండల కేంద్రంలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి ప్రధాన రహదారులు, వివిధ వీధుల మీదుగా ఫ్లాగ్‌మార్చ్ సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఉత్సవ కమిటీలు, యువకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని, నిమజ్జన ర్యాలీలో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని, మద్యం సేవించి ర్యాలీలో పాల్గొని అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాలీతో పాటు నిమజ్జన స్థలం వద్ద కూడా పోలీసుల సూచనలు పాటించాలని, ప్రతి ఒక్కరూ సంయమనం పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జైనూర్ ఎస్సై రవికుమార్, సిర్పూర్(యు) ఎస్సై కొమురయ్య, లింగాపూర్ ఎస్సై సురేష్, ఆర్ఎస్సై మోహన్, ఏఆర్ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ముళ్లపొదలు తొలగించాలని రాస్తారోకో

**విద్యార్థులు, ఆటో యూనియన్ సభ్యుల ఆందోళన**



**పెంచికల్‌పేట్ 22:** పెంచికల్‌పేట్–బెజ్జూర్ ప్రధాన రహదారిపై ముళ్లపొదలు, గడ్డి ఏపుగా పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారడంపై విద్యార్థులు, ఆటో యూనియన్ సభ్యులు మంగళవారం ఆందోళనకు దిగారు. లోడ్పల్లి గ్రామ సమీపంలో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు పెరిగి రహదారి కనిపించని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆటోల్లో ప్రయాణించే వారు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే ముళ్లపొదలు, గడ్డిని తొలగించి రహదారిని శుభ్రం చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలు చోటుచేసుకోకముందే అధికారులు స్పందించాలని కోరారు.

# ఆర్టీఐ దరఖాస్తులను నిర్లక్ష్యం చేయొద్దు

**నిర్దేశిత గడువులో సమాచారం ఇవ్వాలి**

**అధికారులు చట్టాన్ని గౌరవించాలి**

**ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు జాదవ్ విజయ్‌కుమార్**



**,సిర్పూర్(యు),లింగాపూర్ సెప్టెంబరు 22:** సమాచార హక్కు చట్టం కింద పౌరులు దాఖలు చేసే దరఖాస్తులను అధికారులు నిర్లక్ష్యం చేయొద్దని ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు జాదవ్ విజయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ శాఖల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకే ఆర్టీఐ చట్టం అమల్లోకి వచ్చిందని తెలిపారు. అర్హులైన పౌరులు కోరిన సమాచారాన్ని చట్టంలో నిర్దేశించిన గడువులో అందించడం అధికారుల బాధ్యతన్నారు. ఉద్దేశపూర్వకంగా సమాచారం ఇవ్వకుండా జాప్యం చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 20(1) ప్రకారం సరైన కారణం లేకుండా సమాచారాన్ని నిరాకరించినా, ఆలస్యం చేసినా సంబంధిత పీఐఓపై రోజుకు రూ.250 చొప్పున జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ఈ జరిమానా గరిష్ఠంగా రూ.25 వేల వరకు ఉంటుందని తెలిపారు. తప్పుడు, అసంపూర్ణ సమాచారం ఇవ్వడం, రికార్డులను ధ్వంసం చేయడం వంటి చర్యలకూ చట్టప్రకారం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమాచారం అందకపోతే దరఖాస్తుదారులు మొదటి అప్పిలేట్ అధికారిని ఆశ్రయించాలని, అక్కడా పరిష్కారం లభించకపోతే రాష్ట్ర లేదా కేంద్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించే అవకాశం ఉందన్నారు. ఆర్టీఐ చట్టం పౌరుల చేతిలో సమాచార సాధనమే కాకుండా.. అధికారులను జవాబుదారులుగా నిలిపే చట్టబద్ధమైన హక్కు ఆయన పేర్కొన్నారు.

# మాత, శిశు మరణాలు జరగకుండా చూడాలి

**– కలెక్టర్ హరిత**



**,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి సెప్టెంబరు 22:** జిల్లాలో మాతా, శిశు మరణాలు జరగకుండా వైద్యులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో కలిసి గత సంవత్సరం జరిగిన 5 మాతృ మరణాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. వైద్యాధికారులు, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మృతుల కుటుంబ సభ్యుల సమక్షంలో మరణాలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గర్భం దాల్చిన మహిళలకు ప్రతి నెలా వైద్య పరీక్షలు, స్కానింగ్ తప్పనిసరిగా చేయించాలి.పోషకాహారం అందించాలి, రక్తహీనత ఉన్నవారిని గుర్తించి చికిత్స అందించాలి.సుఖ ప్రసవం జరిగేలా ఏర్పాట్లు చేయాలి, అవసరమైతే సురక్షిత ప్రాంతానికి తరలించాలి.హై–రిస్క్ గర్భిణులను ముందే ఆసుపత్రులకు తరలించాలి.ప్రసవం తర్వాత బాలింతలు పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించాలి అని ఆదేశించారు.

వైద్యులు ఇచ్చే సూచనలను ప్రతి గర్భిణీ పాటించేలా సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మాతృ మరణాలు జరిగిన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కే వి ఆర్ పార్టీ కోసం నిరంతరం పనిచేస్తున్నారు

**మాజీ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్**

**తిర్యాణిలో ఘనంగా విశ్వ ప్రసాద్‌రావు జన్మదిన వేడుకలు**



**తిర్యాణి 22:** కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కొక్కిరాల విశ్వ ప్రసాద్‌రావు నిరంతరం పనిచేస్తూనే ఉన్నారని మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్ అన్నారు. మంగళవారం తిర్యాణి మండల కేంద్రంలోని కొమురం భీం చౌరస్తా వద్ద మాజీ డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సాగర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు విశ్వ ప్రసాద్‌రావు ఎప్పటికప్పుడు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారని, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కూడా ఆయన కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ కోసం ఆయన చేస్తున్న కృషి కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ప్రజాసేవ కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పెరుమళ్ల వెంకటేశం గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, జుమ్మిడి కిష్టయ్య, తుంరం మాన్కు, టేకం సురేష్, ఏదుల సుమలత శ్రీనివాస్, నైతం మంగు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెద్మ శంకర్, సింగారపు బాపు, గద్దల మొగిలి, మల్యాల అశోక్, బోర్లకుంట విద్యాసాగర్, మెరుగు వెంకటేశం, మంగం సాగర్, చుంచు చంద్రమౌళి, గుమ్ముల వెంకటేశం, పెద్దల చిన్నయ్య, అంకతి వెంకటేశం, బుద్దే చిన్నయ్య, కొరివి శీను, పడగల అమర్, ఎలగతి వెంకటేశం, కానగంటి విజయ్, దురిశెట్టి సతీష్, షేర్ల ఎల్లయ్య, బొంగోని సాగర్, దుస్స మధుకర్, సంతోష్, శ్రీను, శేఖర్, అశోక్, రాజేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# శోభాయాత్రల్లో డీజేలకు అనుమతి లేదు

**శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు ఎస్సై సుబ్బారావు**



**తిర్యాణి 22:** వినాయక నిమజ్జన శోభాయాత్రల్లో డీజేలకు అనుమతి లేదని తిర్యాణి ఎస్సై సుబ్బారావు అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. శోభాయాత్రల్లో డీజేలు ఏర్పాటు చేసి అధిక శబ్దాలు చేయరాదని, డీజేల వినియోగంతో ఇతరులకు ఇబ్బందులు కలగకుండా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం సేవించి శోభాయాత్రల్లో పాల్గొనడం, అల్లర్లకు పాల్పడటం వంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. భక్తులు, యువత సంయమనం పాటిస్తూ పోలీసుల సూచనలను అనుసరించాలన్నారు. నిమజ్జన మార్గంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి డీజేలు వినియోగించడం, అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# సంఘాల కార్యకలాపాలను పటిష్ఠం చేయాలి

**మంగి సర్పంచ్ రాయి సిడం వినోద్**



**తిర్యాణి 22:** గ్రామ సంఘాల కార్యకలాపాలను మరింత పటిష్ఠం చేసి సభ్యుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని మంగి సర్పంచ్ రాయి సిడం వినోద్ అన్నారు. మంగి జంగుబాయి వీవో ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల ఈ–కేవైసీ నమోదు, టీజీఐఎల్‌పీ, స్త్రీనిధి బకాయిలు, బ్యాంకు లింకేజీ తదితర అంశాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సంఘాల ద్వారా అందుతున్న అవకాశాలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి సభ్యుడు బాధ్యతగా వ్యవహరిస్తే గ్రామ సంఘాలు మరింత బలోపేతమవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కనక శ్రీకాంత్, గ్రామ పెద్దలు, సంఘం సభ్యులు, సీసీలు, వీవోఏలు, కోచ్‌లు పాల్గొన్నారు.